క్లుప్తంగా

ధనుర్మాస పూజలు



కడప కల్చరల్ : కడప నగరం శంకరాపురంలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ధనుర్మాసంలో వచ్చే మంగళవారాన్ని పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా తెల్లవారుజామున శ్రీ ఆంజనేయ స్వామి మూలమూర్తికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం ఆభరణాలు, పుష్ప మాలలతో అలంకరించారు. ప్రత్యేకించి హనుమంతునికి ఇష్టంగా భావించే నాగవల్లీ దళాల (తమలపాకుల) మాలతో అలంకరించి ఆకు పూజ నివేదన చేశారు.

మున్సిపల్ కార్మికుల భిక్షాటన

కడప కార్పొరేషన్: తమ డిమాండ్ల సాధన కోసం మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె 8వ రోజుకు చేరుకుంది. మంగళవారం కార్మికులు భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. తెల్లవారుజాము నుంచి పాత మున్సిపల్ ఆఫీసు సమీపంలోని భగత్ సింగ్ నగర్ క్లాప్ ఆటో స్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర సహాయ కార్యదర్శి ఇ. ప్రకాష్ మాట్లాడుతూ సమ్మె మొదలై 8 రోజులవుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం విచారకరమన్నారు. ఆర్టీయూ నాయకులు సిద్ధిరామయ్య, ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి కార్మికులకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్పెషల్ క్యాంపులో భాగంగా మంగళవారం కడప నగర శివార్లలోని సింగపూర్ టౌన్‌షిప్‌లో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కుటుంబంలో సభ్యుల సంఖ్య.. వారిలో ఎంతమంది చదువుకుంటున్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు ఎంతమంది ఉన్నారనే సమాచారాన్ని ఒక బుక్‌లెట్ రూపంలో సేకరించారు. ఇందులో భాగంగా కాలనీ మొత్తం 200 కుటుంబాలకు సంబంధించిన సమాచారాన్ని పూర్తి చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ చెప్పలి రాజారావు, సింగపూర్ టౌన్‌షిప్ ప్రెసిడెంట్ బండి రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు తమ సమస్యలను పరిష్కరించాలని కడపలో చేపట్టిన సమ్మెకు యూటీఎఫ్, జేవీవీ సంఘాలు మంగళవారం తమ మద్దతు తెలి పాయి. జేవీవీ రాష్ట్ర ట్రెజరర్ రాజశేఖర్ రాహుల్ మాట్లాడారు. కార్యక్రమంలో నగర నాయకులు శివరాం, ఉపాధ్యాయులు సుందరం పాల్గొన్నారు.

ఆటలతో మానసిక వికాసం



మాట్లాడుతున్న బాలోత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు గోపాల్

కడప ఎడ్యుకేషన్: ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు పిల్లల మానసిక వికాసానికి తోడ్పడతాయని కడప బాలోత్సవ కమిటీ అధ్యక్షులు గోపాల్ పేర్కొన్నారు. కడప మరియాపురం సెయింట్ జోసెఫ్ బాలుర పాఠశాలలో ఈనెల 5, 6 తేదీలలో నిర్వహించే బాలోత్సవం మొదటి పిల్లల పండుగను పురస్కరించుకుని మంగళవారం ఆయన కడపలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం సెల్‌ఫోన్లు, ఇంటర్‌నెట్, టీవీల ద్వారా పిల్లలు ఆటపాటలకు దూరం అవుతున్నారని, వ్యాయామం, శారీరక శ్రమ తగ్గిపోతున్నాయన్నారు. పదవీ విరమణ డిప్యూటీ ఈఓ నాగమునిరెడ్డి , బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహులు మాట్లాడుతూ జనవరి 5వ తేదీ డీఈఓ రాఘవరెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. తర్వాత కల్చరల్, అకడమిక్ 42 విభాగాలలో పిల్లలకు పోటీలు జరుగుతాయన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.

డ్రైనేజీ పనుల పర్యవేక్షణ

చెన్నూరు : స్థానిక సరస్వతి నగర్, గాంధీనగర్, లక్ష్మీనగర్, యానాది కాలనీలలో జరుగుతున్న ప్రధాన డ్రైనేజీ కాలువ పనులను ఎస్ఈ ఎంసీ వీరన్న, డీఈ మురళి కొండారెడ్డిలు మంగళవారం పర్యవేక్షించారు. రూ.45 లక్షల ఎంపీ నిధులతో చేపట్టిన ఈ పనులను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, ఏ ఈ వినోద్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ మార్గాలను పెంపొందించుకోవాలి

- స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేయర్ సురేష్ బాబు
- రూ.825.62 కోట్ల నగరపాలక బడ్జెట్‌కు ఆమోదం

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ ఆదాయ మార్గాలను పెంపొందించుకోవాలని మేయర్ కె. సురేష్ బాబు సూచించారు. మంగళవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.825.62కోట్లతో రూపొందించిన బడ్జెట్‌ను ఆమోదించారు. రెండో విడత 'జగనన్న సురక్ష', 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో పరీక్షలు నిర్వహించడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించినవారికి సరైన హాస్పిటల్స్‌కు రెఫర్ చేయాలన్నారు. మాసాపేటలో ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్లపట్టాలు ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రామక్రిష్ణ నగర్‌లో నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చే అంశంపై కేబినెట్‌కు పంపించాలన్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మె వల్ల ఘన వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. అభివృద్ధి పనులు పూర్తయిన వాటికి వెంటనే బిల్లులు తయారు చేసి, కాంట్రాక్టర్లకు వీలైనంత త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, పబ్లిక్ హెల్త్ విభాగాలలో అడ్వర్‌టైజ్‌మెంట్ ట్యాక్స్, ట్రేడ్ లైసెన్సులను పెంచుకునేందుకు కృషి చేయాలన్నారు. అనవసర ఖర్చులను తగ్గించుకుంటూ, ఆదాయాలను పెంచుకుంటూ ముందుకు సాగాలన్నారు.

– ఈ కార్యక్రమంలో కేఎంసీ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్, స్టాండింగ్ కమిటీ సభ్యులు మల్లీశ్వరి, వై. మాధవి, ఎం. సుజాత, గౌస్ జబీన్, కె. అరుణ ప్రభ, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, ఎస్ఈ రత్నాల రాజు, ఈఈలు నారాయణస్వామి, కరిముల్లా ఖాన్, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, ఆర్ఓలు విజయ్ భాస్కర్ గౌడ్, కన్నయ్య, ఎంహెచ్ఓ డా. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న, మేయర్ సురేష్ బాబు

సాహస యాత్రికులకు అభినందన

వైవీయూ: హిమాచల్ ప్రదేశ్‌లో డిసెంబర్ 10 నుంచి 28 వరకూ వివిధ సాహస రంగాలలో శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకొని తిరిగివచ్చిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లను వైవీయూ అధికారులు అభినందించారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ వెంకట్రామిరెడ్డి, క్యాంపు కంటింజెంట్ డా. కె.శ్రీనివాసరావుతో కలిసి వలంటీర్లు వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వీసీ క్యాంపు గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంబీఏ విభాగం నుంచి వెంకట సుబ్రహ్మణ్యం, మనీష, ఎంసీఏ నుంచి మానస, జగదీష్ , జువాలజీ నుంచి శ్రావణి, బాబా ఫైరోజ్ లు స్వం దిస్తూ హిమాచల్ ప్రదేశ్‌లోని అటల్ బిహారి వాజ్‌పేయి ఇన్‌స్టిట్యూట్ మౌంట్ నీరింగ్ అండ్ అల్లైడ్ స్పోర్ట్స్ మనాలిలో వివిధ రంగాల్లో శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్నామన్నారు. తమతో పాటూ వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల నుండి త్రివేణి, అశోక్, వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ నుండి అఖిల్, భవిత రాయ్ ఉన్నారన్నారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ్‌రెడ్డి సాహసయాత్రలో పాల్గొన్న విద్యార్థులను, కంటింజెంట్ లీడర్ డాక్టర్ కె.శ్రీనివాసరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డా. ఎస్.పి. వెంకటరమణ,డా.టి.చంద్రశేఖర్, డా. గంగయ్య పాల్గొన్నారు.



సాహస యాత్రికులను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

ఆరోగ్యశ్రీ నిరుపేదలకు ఒక వరం

వల్లూరు : రాష్ట్రంలోని నిరుపేదలకు డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకం ఒక వరం లాంటిందని ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి తెలిపారు. కడప నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం కమలాపురం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 15 మంది లబ్ధిదారులకు రూ.32 లక్షల 2 వేల విలువ చేసే చెక్కులను ఆయన అందచేసి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తూ వైద్యరంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా కార్పొరేట్ వైద్యశాలల్లో చికిత్స పొందడానికి అవకాశం కల్పిస్తూ వ్యాధుల సంఖ్యను గణనీయంగా పెంచారన్నారు.

పథకం కింద ఇప్పటి వరకు వున్న వైద్య సేవల పరిమితిని రూ.25 లక్షల వరకు పెంచి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించార న్నారు. చికిత్స పొందిన రోగి పూర్తిగా కోలుకుని తిరిగి పనుల్లోకి వెళ్లే వరకు ఆరోగ్య ఆసరా ద్వారా రోజుకు రూ.225 చొప్పున నెలకు రూ.5 వేలు చెల్లిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారన్నారు. ఆరోగ్య శ్రీ పథకం కింద వర్తించని జబ్బులకు సంబంధించి చికిత్సలు పొందిన బాధితులను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటున్నారని తెలిపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యంగా మారిన ఆరోగ్య శ్రీ పథకానికి జీవం పోసి కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల వైఎస్ఆర్‌సీపీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆర్ఓబీ పనులను వేగవంతం చేయండి

కమలాపురం : పట్టణ ప్రజల చిరకాల కోరిక అయిన ఆర్ఓబీ పనులను వేగంగా చేయాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక రైల్వే గేటు సమీపంలో చేపట్టిన సాయిల్ టెస్టింగ్ మిషన్‌ను ఆయన ప్రారంభించారు. పనుల నిర్వహణపై కాంట్రాక్టర్‌తో ఆరా తీశారు. పనులు నాణ్యతగా చేపట్టాలని, అలాగే పనుల్లో వేగం పెంచాలన్నారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజల చిరకాల కోరిక అయిన ఆర్ఓబీ పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఇప్పటికే అన్ని అనుమతులు వచ్చాయని, సాయిల్ టెస్టింగ్ పూర్తి చేసి ఫలితాలు రాగేనే ఆర్ఓబీ నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. ఆర్ఓబీ పూర్తి అయితే ప్రజల గేటు కష్టాలు తొలగిపోతాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధి పని చేస్తోందన్నారు. ప్రజల కష్టాలు తన కష్టాలు భావించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కమలాపురం ఆర్ఓబీకు నిధులు మంజూరు చేశారన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో జగనన్నను తిరిగి సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, సుబ్బారెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఓబీ పనుల్లో భాగంగా సాయిల్ టెస్టింగ్ మిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం

కమలాపురం : రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం అని డీఎంహెచ్ఓ నాగరాజు తెలిపారు. మంగళవారం మండలంలోని నల్లింగాయపల్లెలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. రోగులకు జగనన్న సురక్ష కిట్లను అందజేశారు. శిబిరానికి వచ్చిన 300 మందిని వైద్యులు కాళ హస్తీశ్వర్‌రెడ్డి, మమతారెడ్డి, ఎస్ఏఎస్ ఫరూక్, ప్రీతిలు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అలాగే బీపీ, షుగర్ తదితర రక్త పరీక్షలు చేసి రిపోర్టులు అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే పరమావధిగా, రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. గతంలో కూడా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ప్రస్తుతం ఫేజ్-2 జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. మధ్యాహ్నం రోగులకు జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, సుబ్బారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ జ్యోతి, తహసీల్దార్ సరస్వతి, ఈఓపీఆర్‌డీ శారదారెడ్డి, పంచాయతీ సెక్రటరీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రోగులకు జగనన్న సురక్ష కిట్లను అందిస్తున్న డీఎంహెచ్ఓ నాగరాజు

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



కడప ఎడ్యుకేషన్: ఆల్‌మేవా క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాష



వైవీయూ: క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, జీసీటీఏ నాయకులు



కడప కోటిరెడ్డిసర్కిల్ : క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఏపీ జేఏసీ అమరావతి నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఆల్ మేవా 2024కు సంబంధించిన క్యాలెండర్‌ను మంగళవారం డిప్యూటీ సీఎం అంజాద్‌బాష కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పీఎం జలీల్‌ఖాన్ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాష, ఆల్ మేవా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ షారూఖ్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అంజాద్‌బాష మాట్లాడుతూ ఆల్ మేవా దినదినాభివృద్ధి చెందుతుందని మైనార్టీ ఉద్యోగ, ఉపాధ్యాయుల మనుగడ కోసం పాటు పడుతున్న సంఘం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆల్‌మేవా జిల్లా ప్రధాన కార్యదర్శి నజీర్‌బాష, ఆర్థిక కార్యదర్శి మైనుద్దీన్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కడప కోటిరెడ్డిసర్కిల్/ కడప ఎడ్యుకేషన్ : ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఏపీ జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షులు జీవన్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ ఉద్యోగులకు అన్ని విధాలా ఉపయోగపడేలా క్యాలెండర్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు కృష్ణ కుమార్, రొనాల్డ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య డైరీ ఆవిష్కరణ

కడప ఎడ్యుకేషన్: కడప నగరం బాలాజీనగర్‌లోని ఏకలవ్య ఫౌండేషన్ కార్యాలయంలో మంగళవారం విద్యా కమిటి సలహాదారు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు అధ్యక్షతన ఏకలవ్య ఫౌండేషన్ డైరీని నెహ్రూ యువజన కేంద్ర ప్రాజెక్టు మేనేజర్ మణికంఠ ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యా కమిటి చైర్మన్ బాలకృష్ణ, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జీసీటీఏ ఆధ్వర్యంలో..

వైవీయూ: ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం (జీసీటీఏ) ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ ఆవిష్కరించారు. మంగళవారం కళాశాలలో జీసీటీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అధ్యాపకుల కృషి ఎనలేనిదన్నారు. జీసీటీఏ జిల్లా కార్యదర్శి డా. ఆర్. నీలయ్య, వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్, జిల్లా ఆర్థిక కార్యదర్శి డా. పి. రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైవీయూలో సీఎంసీ ప్రారంభం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో జరిగే ప్రతి కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ కాన్ఫరెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం (సీఎంసీ)లో అందుబాటులో ఉంటుందని వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ తెలిపారు. వైవీయూ ఐటీశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ×కాన్ఫరెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం×ను వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో నిర్వహించే కాన్ఫరెన్స్‌లు, సెమినార్, వర్క్‌షాప్‌ల బ్రోచర్‌లు, రిజిస్ట్రేషన్ వెబ్‌లింక్, చెల్లింపు ఎంపికలు (క్యూఆర్ కోడ్), కమిటీ సమాచారం, ప్రోగ్రాం షెడ్యూల్, సంప్రదించాల్సిన వారి సమాచారం అన్నీ ఒక్క క్లిక్‌తో తెలుసుకోవచ్చన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి , ఐటీసెల్ డైరెక్టర్ ఆచార్య ఎం.వి. శంకర్ , ఐక్యూఏసీ డైరెక్టర్ డా. ఎల్. సుబ్రమణ్యం శర్మ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ తనిఖీ

వల్లూరు : మండల కేంద్రమైన వల్లూరులో జరుగుతున్న రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని కడప ఆర్డీవో మధుసూదన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయన గ్రామంలో ఇంటింటికీ రేషన్ సరఫరా వాహనంతో ఇస్తున్న రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో రేషన్ సక్రమంగా అందుతోందా లేక ఏమైనా సమస్యలు వున్నాయా అని ఆరా తీశారు. బియ్యంతో పాటు ఇతర సరుకులు ఇవ్వకుంటే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా లబ్ధిదారులకు రేషన్‌ను అందించాలని ఎండీయూ వాహన నిర్వాహకునికి ఆదేశించారు. తమ క్లస్టర్ పరిధిలో రేషన్ పంపిణీ జరిగే సమయంలో గ్రామ వలంటీర్లు వాహనం వెంట వుండి ప్రతి ఒక్కరికీ రేషన్ అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి స్వరూప్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బకాయిలను చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎస్టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల రామచంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని ఎస్టీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 12వ పీఆర్‌సీ అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు రాజగోపాల్‌రెడ్డి, మదన్‌రెడ్డి, చంద్రశేఖర్, శ్రీరామ్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

వైవీయూ : వైవీయూ ఎంబీఏ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తామని వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం వైవీయూ గురుకుల భవనాలను రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి వీసీ పరిశీలించారు. ఈ యేడాది ఎంబీఏ, హెచ్ఆర్ఎం, కామర్స్ కోర్సుల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిన దృష్ట్యా తరగతి గదులను ఆధునీకరిస్తామన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఇంజనీర్ రాజశేఖరరెడ్డి, ఎంబీఏ విభాగాధిపతి డా. అమృతప్రసాద్‌రెడ్డి, డా. ఎస్.వి. సుబ్బారెడ్డి, డా. సుబ్బారెడ్డి, డా. బి. గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : హైదరాబాదులోని ప్రథమ్ హెల్త్ కేర్ శిక్షణా కేంద్రంలో రెండు నెలలపాటు నర్సింగ్ అసిస్టెంట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ సరితాసింగ్ తెలిపారు. 18-30 సంవత్సరాలలోపు వయస్సు కలిగి టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఏఎన్ఎం, జీఎన్ఎం, డిప్లొమా ఏదైనా ఒకేషనల్ కోర్సులో ఉత్తీర్ణులై ఉండి ఆధార్‌కార్డుతో జనవరి 5వ తేదీలోగా తమపేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 90002 03952 నంబరులో సంప్రదించాలన్నారు.

బాలోత్సవం విజయవంతం చేయాలి

కడప ఎడ్యుకేషన్: కడప మరియాపురం సెయింట్ జోసెఫ్ హైస్కూల్లో ఈ నెల 5, 6 తేదీలలో నిర్వహించనున్న కడప బాలోత్సవం పిల్లల పండుగను జయప్రదం చేయాలని జనవిజ్ఞాన వేదిక నగర కార్యదర్శి షేక్ రాయల్ కరీముల్లా కోరారు. సంబంధిత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం కడప ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కరపత్రాలను అందించి కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావును కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అంజాద్‌బాష, షకీలాబేగం , విద్యార్థులు పాల్గొన్నారు.

పరామర్శ

కడప కార్పొరేషన్: అనారోగ్యంతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న 44వ డివిజన్ వైఎస్ఆర్‌సీపీ నాయకుడు మున్నాను ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా పరామర్శించారు. మంగళవారం అరుణాచల హాస్పిటల్‌కు వెళ్లి మున్నా ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, ఎన్. సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ, కార్పొరేటర్ షఫీ పాల్గొన్నారు.

ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : సిద్దేశ్వరం వద్ద అలుగు నిర్మించడం ద్వారా పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమ ప్రాజెక్టులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఆందోళన సందర్భంగా ప్రభుత్వం నమోదు చేసిన తప్పుడు కేసులు ఎత్తివేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి జిల్లా కన్వీనర్ దేవగుడి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. అప్పట్లో ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించిన నంద్యాలకు చెందిన బొజ్జా దశరథరామిరెడ్డిని మంగళవారం అరెస్టు చేయడం బాధాకరమన్నారు. నాటి చంద్రబాబు ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులు ఎత్తివేయడంతోపాటు సిద్దేశ్వరం అలుగు నిర్మాణంపై దృష్టి సారించాలని కోరారు.

ఉయ్యాలవాడ, బుడ్డా విగ్రహాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, మహాదాత బుడ్డా వెంగళరెడ్డి కాంస్య విగ్రహాలను కడప నగరంలో ఏర్పాటు చేయాలని రేనాటి సూర్యచంద్రుల విగ్రహ ఏర్పాటు కమిటీ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక మానస ఇన్ హోటల్‌లో వారు మాట్లాడారు. నగర సుందరీకరణలో భాగంగా అభివృద్ధి చేసిన కూడళ్లలో ఎక్కడో ఒక చోట జిల్లాకు ఉయ్యాలవాడ, బుడ్డా విగ్రహాలు ఏర్పాటు చేయడం భావితరాలకు స్ఫూర్తినిస్తుందన్నారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబుతో పాటు ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇస్తామన్నారు. సమావేశంలో ఇంటాక్ జిల్లా కన్వీనర్ కె.చిన్నపరెడ్డి, వైవీయూ పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, కేసీ కెనాల్ కడప డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ దేవగుడి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలపై జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి బాబా ఫకృద్దీన్

కడప అర్బన్: పిల్లల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలనిని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ అన్నారు. మంగళవారం కడప నగరంలోని ప్రభుత్వ బాలుర గృహంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు అందుతున్న వసతి, సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయసేవలు పథకం 2015ను వివరించారు. ఇంకా పలు అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి, జువైనల్ జస్టిస్ బోర్డ్ జడ్జి జె. నందిని, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాసులు, ప్రభుత్వ బాలుర గృహం సూపరింటెండెంట్, వైద్యాధికారి పాల్గొన్నారు.

కార్యాలయం ప్రారంభం

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని మా సీమ సర్కిల్‌లో మంగళవారం షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నగర కార్యాలయాన్ని సంఘ సేవకుడు బిల్డర్ నాగరాజు ప్రారంభించారు. నగర అధ్యక్షులు లయన్ ఫటాన్ ఖాదర్‌భాష మాట్లాడుతూ కడప నగరంలో కార్యాలయం ఏర్పాటు చేయడం సంతోషకరం అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్లా, సభ్యులు పాల్గొన్నారు.

నేడు లూయి బ్రెయిలీ జయంతి

కడప ఎడ్యుకేషన్: కడప నగరం ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాలలో బుధవారం అంధుల లిపికర్త లూయి బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఏపీ రాష్ట్ర రాయల్ అంధుల సంఘం అధ్యక్షులు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. వేడుకల్లో భాగంగా 3, 4 తేదీలలో అంధులైన టీచర్స్, బ్యాంకు ఉద్యోగులు, ఇతర శాఖలో పని చేసే అంధులకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

మద్యం పట్టివేత

కడప అర్బన్: కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో వినాయకనగర్ సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వడ్డెర నరసింహులు అనే వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 9 క్వార్టర్ బాటిళ్ల మద్యంను పోలీసు సిబ్బంది పట్టుకున్నారు.

– కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అల్మాస్‌పేటలో మట్కా రాస్తున్న ఆటోడ్రైవర్ రామయ్యను ఎస్ఐ సంజీవరాయుడు తమ సిబ్బందితో అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 2010 నగదును, మట్కా స్లిప్‌లను సీజ్ చేశారు.